క్లుప్తంగా

దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారి గర్భగుడిలో బినామీలు యథేచ్ఛగా విధులు నిర్వహిస్తున్నారని, అక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు కనిపించడం లేదని వేములవాడకు చెందిన సామాజిక కార్యకర్త కనికరపు తిరుపతి రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఇలాంటి బీనామీలతో కాకుండా తమ ఉద్యోగులతోనే పనులు చేయించాలని, లేకుంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులను లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన జోగం సహస్ర, దాసరి ధనలక్ష్మి, మొర్రి వెన్నెలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రోమాల ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ విద్యాకమిటీ చైర్మన్ పాలకుర్తి పర్శరాములు, సభ్యులు సామల్ల కమలాకర్, రోమాల తిరుపతి, స్వామి, దుబ్బయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

ముస్తాబాద్: మండలకేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కబడ్డీ, వాలీబాల్ టీంలు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి, స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని, క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

ఉపాధి కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు



ఉపాధి కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యుడు

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు అడవి పదిర, రంగంపేట, గర్జనపల్లి, వన్‌పల్లి, పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు గురువారం ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను అశ్విని హాస్పిటల్ వైద్యుడు అభినయ్, సిబ్బంది అందించారు. పని జరిగే చోట ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు వీటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు అజ్మీర రాజు, తుడుము రాజ ఎల్లయ్య, నాగారపు దేవేందర్, గొర్రె మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయరూ.!



వీర్నపల్లి- కంచర్ల మధ్య ఉన్న మూలమలుపు

వీర్నపల్లి: మండలకేంద్రం నుంచి ఎల్లారెడ్డిపేట మండలానికి వెళ్లే దారిలో దాదాపు 16 వరకు మూలమలుపులు ఉన్నాయి. ఏ ఒక్క మూలమలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆలయ వార్షికోత్సవం

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో చౌడాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా యాదవ సామాజికవర్గం ఇళ్లపై సరుగు పోశారు. రాత్రి చౌడలమ్మ బోనాలను తీశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

30 పడకల ఆస్పత్రి కలేనా?

- ఆరునెలల క్రితం మంజూరు
- అడ్డంకిగా మారిన స్థల సేకరణ
- పీహెచ్‌సీలో నిర్మించేందుకు అనుమతులు
- రోగులకు తప్పని తిప్పలు



పోతుగల్‌లో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

ముస్తాబాద్: మండలంలోని పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలన్న పాలకుల లక్ష్యం నేరవేరడం లేదు. ఆరునెలల క్రితం మంజూరైన ముప్పై పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణ అడ్డంకిగా మారింది. ముస్తాబాద్‌తో పాటు ఇల్లంతకుంట మండలానికి ఆరునెలల క్రితం అప్పటి మంత్రి కేటీఆర్ 30 పడకల ఆస్పత్రి మంజూరు చేయించారు. అందుకు నిధులు కూడా విడుదల చేశారు. ఆస్పత్రి నిర్మాణంతో అన్ని వైద్యసేవలు అందుతాయనుకున్న మండల ప్రజలకు నిరాశే మిగిలిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని పోతుగల్‌లో 1965లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షాలు ఏడాది క్రితం వరకు 30 పడకల ఆస్పత్రిని ముస్తాబాద్‌కు మంజూరు చేయాలని పెద్దఎత్తున నిరసనలు చేపట్టాయి.

స్థల సేకరణ కరువు

పోతుగల్‌లో పీహెచ్‌సీ ఉండగా, ముస్తాబాద్‌లో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మిస్తే మండల ప్రజలకు అందుబాటులో ఉంటుందని, మండలానికి రెండు ప్రధాన ఆస్పత్రుల సేవలు అందుతాయని భావించారు. అయితే ముస్తాబాద్‌లో రత్నాలకుంట వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆస్పత్రి నిర్మించాలని సర్వే చేపట్టారు. అది కార్యరూపం దాల్చకపోవడంతో మొర్రాయిపల్లె, నామాపూర్ రహదారుల్లో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆస్పత్రిని నిర్మించాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు. గత నవంబర్‌లో ముప్పై పడకల ఆస్పత్రి మంజూరుకాగా, ఫిబ్రవరిలో ఎన్నికల కోడ్‌తో ఎవరూ పట్టించుకోలేదు. ఈలోగా వైద్య ఆరోగ్యశాఖ పోతుగల్‌లోని పీహెచ్‌సీ స్థలంలోనే 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని అధికారులకు నివేదిక పంపించారు. దీంతో ముస్తాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించే అవకాశాలు సన్నగిల్లాయి.

ముప్పై పడకల ఆస్పత్రిలో అందే సేవలివే..

ప్రభుత్వం మారుమూల మండలకేంద్రాల్లో ముప్పై పడకల ఆస్పత్రులు నిర్మించి వైద్యసేవలు మెరుగుపరుస్తోంది. ఈ క్రమంలో ముస్తాబాద్‌కు మంజూరైన ఆస్పత్రిలో గైనాకాలజిస్ట్, ఎముకల, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ వంటి వైద్యుల తోపాటు స్టాఫ్‌నర్సులు, సిబ్బంది, అధునాతన ల్యాబ్, ప్రసూతి, సర్జరీలు అందుబాటులోకి వస్తాయి. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు ముప్పై పడకల ఆస్పత్రి కోసం ఉద్యమాలు చేపడితే అధికారంలోకి వచ్చాక, ఆస్పత్రి నిర్మాణంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముస్తాబాద్‌లోనే నిర్మించాలి



పోతుగల్‌లో ఇప్పటికే పీహెచ్‌సీ ఉంది. ముస్తాబాద్‌లో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మిస్తే అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. మండల కేంద్రంలో పదివేల జనాభా ఉంది. వారు దానిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. స్థలాన్ని సేకరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– శాగ మహేశ్, ముస్తాబాద్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ముస్తాబాద్‌లో ముప్పై పడకల దవాఖాన నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని సేకరిస్తాం. మండలానికి 30 పడకల ఆస్పత్రి మంజూరైనా, పోతుగల్‌లో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం అలాగే ఉంటుంది. రెండెకరాలు కావాలంటున్నారు. అందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థలం సేకరిస్తాం.

– గుండెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపాం



మండలకేంద్రంలో స్థలం దొరకకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయని, పోతుగల్‌లోనే ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇంకా అనుమతులు రాలేదు. అనుమతులు రాగానే ఆస్పత్రి నిర్మాణ పనులు చేపడుతారు.

– డాక్టర్ సుమన్‌మోహన్ రావు, జిల్లా వైద్యాధికారి

'కాంగ్రెస్‌పై విశ్వాసం కోల్పోయారు'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తన ఉనికి కోల్పోవడం ఖాయమన్నారు. అబద్దాలతో గద్దెనెక్కిన ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారన్నారు. కేసీఆర్ చేసిన బస్సుయాత్రతో జాతీయ పార్టీలో వణుకు మొదలైందన్నారు. ఎన్నికలకు ముందు క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న వడ్లకే రూ.500 ఇస్తామని సీఎం అంటున్నారని ఆరోపించారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందే సుభాష్, కొండ రమేశ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్, పిల్లి కిషన్, రాజునాయక్, తిరుపతి నాయక్, దేవరాజు, సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన చింతపంటి మల్లయ్య ఇటీవల మృతిచెందాడు. గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఆందోళన చెందొద్దు..

అకాలవర్షానికి కల్లాల వద్ద ఉన్న వరిధాన్యం తడిసిపోగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నూకలమర్రి గ్రామంలో కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వారికి సూచించారు.

కొనుగోళ్లు పూర్తయ్యేదెన్నడో ?



రుద్రంగి కొనుగోలు కేంద్రంలో నెలరోజులుగా పేరుకుపోయిన ధాన్యపు రాశులు

- పూర్తికాని ధాన్యం కొనుగోళ్లు
- రైతులు పడిగాపులు
- అకాలవర్షాలకు తడస్తుండటంతో మరింత ఇబ్బంది

రుద్రంగి: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. గన్నీ సంచులు, లారీల కొరత, ఇతర కారణాలతో మండలంలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో నెలల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. ఎన్నికల కోడ్‌తో ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు అకాలవర్షాలకు తూకం వేసిన ధాన్యం బస్తాలు తడుస్తుండటంతో ఆరబెట్టిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టే పరిస్థితి ఎదురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభంకానుండగా ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమయ్యే సమయంలో ధాన్యం అమ్మకాలు పూర్తికాక వారు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ధాన్యం కొనుగోళ్లు త్వరగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

హైదరాబాద్‌కు కాంగ్రెస్ సోషల్‌మీడియా వారియర్లు



హైదరాబాద్ వెళ్తున్న సోషల్ మీడియా వారియర్లు

ముస్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశానికి హైదరాబాద్‌కు సోషల్‌మీడియా వారియర్లు గురువారం తరలివెళ్లారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు సోషల్ మీడియాను వినియోగించుకుంటున్నాయని, అందుకు ధీటుగా కాంగ్రెస్ సోషల్ మీడియా పనిచేసేందుకు సిద్ధంగా ఉందని ముస్తాబాద్ బాధ్యుడు ఎదునూరి భానుచందర్ పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: దాతల సహకారంతో వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1115 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ముందు, రాజన్న ఆలయం, భీమేశ్వరాలయం వద్ద పేదలకు ఆహార పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, పొలాస రాజేందర్, శ్రీనివాస్, లాయక్‌పాషా, దాసు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వానకే రోడ్డుపైకి వరదనీరు..



వేములవాడ : ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే సెస్ కార్యాలయం పక్కనున్న ప్రధాన రోడ్డుపైకి ఇలా చిన్నపాటి వర్షానికే వరదనీరు చేరుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు ఈరోడ్డు గుండా వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నిర్మించిన డ్రైనేజీ ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు అందులోకి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో వరదనీరంతా రోడ్డుపైనే చేరుతోంది. మున్సిపల్ అధికారులు రోడ్డుపై వరదనీరు నిలవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పిడుగుపాటు బాధితులకు పరామర్శ

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి శివారులో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై వేములవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని నాయకులు పరామర్శించారు. పిడుగుపాటుకుగురై చికిత్స పొందుతున్న కంబళ్ల లక్ష్మి, కంబళ్ల ఎల్లయ్య, కొమురవ్వ, రేగుల శ్రీనివాస్, రేగుల దేవయ్యను ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, బీఆర్ఎస్ నాయకులు సలీంలు పరామర్శించారు.

సీఐ విచారణ

వేములవాడ: పట్టణ శివారులోని మల్లారం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ హోంగార్డు వడిజె రాజు అనే వాహనదారుడిపై కర్ర విసరగా గాయాలయ్యాయి. దీనిపై టౌన్ సీఐ వీరప్రసాద్ గురువారం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: అకాలవర్షాలతో పంటలు దెబ్బతిన్న, ధాన్యం తడిసిపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఈ ఏడాది రైతులకు రైస్ మిల్లర్ల ద్వారా ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, లింగంగౌడ్, బాబు, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



నాంపల్లి సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ రాజం గురువారం పరిశీలించారు. 'గాలి వీచిందా.. కరెంట్ గోవిందా' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు నాంపల్లి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సమస్యపై సెస్ మేనేజింగ్ డైరెక్టర్, సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ అధికారులతో అన్ని విషయాలు చర్చించినట్లు తెలిపారు. సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి నందికమాన్, మర్లపేటలో ఏడు కరెంట్ స్తంభాలు గాలికి పొడిపోయినట్లు తెలిపారు. వెంటనే పనులు చేయాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.

చిన్నారులపై పిచ్చికుక్కల దాడి



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో పిచ్చికుక్కలు వీరంగం సృష్టించాయి. 34వ వార్డులో గురువారం ఎనిమిదేళ్ల నర్సింగోజు లిమ్స్, చొడవరం ఆద్యలపై దాడి చేశాయి. తల, మెడ, ఛాతిపై తీవ్రగాయాలయ్యాయి. పిల్లల అరుపులతో చుట్టపక్కల వారు తేరుకుని కొట్టడంతో చిన్నారులకు పెను ప్రమాదం తప్పింది. అదే వార్డులో కొద్ది రోజులుగా మరో ఎనిమిది మంది పిల్లలపై వీధి కుక్కలు దాడి చేశాయని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక లారీలు పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీలు

గంభీరావుపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ తెలిపారు. మండలంలోని రాజేశ్వర్‌రావు నగర్ వద్ద ఎస్సై ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు లారీలను ఆపినట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కాళేశ్వరం నుంచి కామారెడ్డికి ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్నామని, సదరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సింగారంలో ఈత చెట్ల తొలగింపు

- ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంలో అక్రమంగా ఓ వ్యక్తి జేసీబీతో ఈత చెట్లను గురువారం తొలగించాడు. ఉపాధినిచ్చే ఈత చెట్లను అక్రమంగా తొలగించడంతో గీత కార్మికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన జక్కు భూమయ్య జేసీబీతో సుమారు 20 ఈత చెట్లను తొలగించాడు. భూమయ్యపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని గీత కార్మికులు అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లి- రాజన్నపేట మధ్య గురువారం రాత్రి ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. రాజన్నపేటకు చెందిన రాణవేణి శంకర్ తన ద్విచక్రవాహనంపై రాచర్ల గొల్లపల్లికి వస్తుండగా, అల్మాస్‌పూర్‌కు చెందిన నేరెళ్ల శ్రీనివాస్ తన ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి - రాజన్నపేట గ్రామాల మధ్యకు చేరుకోగానే వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



సూచిక బోర్డులు లేక.. తికమక

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి శివారులోని వట్టిమల్ల, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల మధ్య మూలమలుపు వద్ద సూచికలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోడ్ల కూడలి కావడంతో ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.